

# వెండితెర సాక్షిగా

- జీడిగుంట రామచంద్రమూర్తి



## కమీషన్ ఏజంట్లు ఇక్కడ కూడానా?

**'సొంతలాభం కొంతమానుకుని** పొరుగువానికి సాయపడవోయ్' అన్నారు మహాకవులు.

అలా 'స్వంతం - స్వార్థం' మానుకుని పొరుగుమనిషికి అంతో ఎంతో సహాయం చేయాలనుకునేవాళ్ళు ఇవాళ మన సొసైటీలో వుంటారంటే ఆశ్చర్యపోక తప్పదు.

ఎందుకంటే ఇవాళ మనం ఏ పని చేసినా స్వంతలాభాన్నే చూసుకుంటున్నాం తప్ప కొంతయినా దాన్ని వదులుకోటంలేదు. పైగా పరాయివాడు పతనమవుతూంటే చూసి పరోక్షంగా పరవశిస్తున్నాం.

అదే ఓ సినిమాలో చూపించినట్టు ఎవరైనా మనదగ్గరకొచ్చి సహాయాన్ని కోరితే సదరు సహాయాన్ని అవలీలగా చేయగల స్థితిలో మనం వున్నా 'నీకు ఆ సహాయం చేస్తే మరి నాకేంటి?' అని చెయ్యి చాపుతున్నాం ఈ మెంటాలిటీ రాజకీయరంగంలో ఎక్కువగా కనిపిస్తుందని కొందరంటే, సినిమారంగంలో కూడా వుంటుందంటాడు రాంబాబు.

రాంబాబుది హైదరాబాదు. హైదరాబాదులోనే పుట్టాడు. అక్కడే పెరిగాడు. అక్కడే చదువుకున్నాడు. చిన్నప్పట్నించీ సినిమాలు బాగా చూసేవాడు. విడుదలయ్యే ప్రతి తెలుగు సినిమానీ విడవకుండా మొదటిరోజునే చూడటం అతని హాబీ. తాను చూడటం కాకుండా తన మిత్రబృందాన్నికూడా వెంటబెట్టుకుని వెళ్ళేవాడు. కనీసం సినిమా ఖర్చులు కలిసొస్తాయన్న ఉద్దేశ్యంతో చాలామంది కుర్రాళ్ళు అతనితో స్నేహం చేయాలని తహతహలాడేవారు.

ఆ విధంగా ఓ కొత్త సినిమా విడుదలైందంటే కనీసం నలుగురు స్నేహితుల్నైనా వెంట తీసుకెళ్ళి ఎడం పక్కన ఇద్దర్నీ, కుడిపక్కన ఇద్దర్నీ కూర్చోబెట్టుకుని మధ్యన తానో మహారాజులా పరివేష్టితుడయ్యేవాడు.

తన అభిమాన హీరో నటించిన చిత్రమైతే పాతిక రూపాయలతో గులాబీపూలు కొనితెచ్చి పాటపాటకీ పూలరేకులు హీరో మీద జల్లేవాడు. అక్కడితో ఆగకుండా సినిమాలో ఓ పాత్ర ఏదైనా డైలాగు చెబుతూంటే తర్వాత పాత్ర ఏ డైలాగు చెబుతుందో ముందే వూహించి చెప్పేసేవాడు. ఆ ఫీటు చూసి అతని మిత్రులంతా ఆశ్చర్యచకితులయ్యేవారు. 'నువ్వు సినిమా రైటర్‌వి ఎందుకు కాకూడదూ?' అని ఓసారి అతని మిత్రుడు అడిగాడు రాంబాబుని. ఆ ప్రశ్న రాంబాబులో విపరీతమైన సంచలనాన్ని లేపింది.

'నిజమే! తను సినిమాకి డైలాగులు ఎందుకు రాయకూడదూ?' అని ప్రశ్నించుకున్నాడు. వందలాది సినిమాలు చూసిన అనుభవం తనకుంది. ప్రేయసీప్రియులు కలుసుకుని తమ ప్రేమను వ్యక్తం చేసుకునేటప్పుడు ఎలా మాట్లాడుకుంటారో, తండ్రీకొడుకుల మధ్య అభిప్రాయ భేదాలు వచ్చినప్పుడు ఏ డైలాగులు వాడతారో ఇంకా అనేక సందర్భాల్లో ఆయా పాత్రలు ఎలా సంభాషిస్తాయో సినిమాలు చూసేటప్పుడు ముందుగానే తాను ఊహించి చెప్పేవాడు.

అలాంటప్పుడు తాను మాత్రం ఎందుకు రాయలేడు? హైదరాబాదులోనే వుంటున్న ఓ ప్రముఖ రచయితను కలుసుకుని తన మనసులోని మాట చెప్పాడు రాంబాబు. "మీరు ఎలా అయినా నాకు సహాయం చేయాలి" అని అర్థించాడు.

"చూడు తమ్ముడూ! సినిమా అనేది ఒక వ్యాపారం. ఈ వ్యాపారంలో లాభాలు రావాలన్న ఆలోచనతోనే లక్షలు పెట్టుబడి పెడతాడు నిర్మాత. అటువంటప్పుడు కొత్తవాళ్ళతో ఎక్స్‌పెరిమెంట్ చేయటం కష్టం" వివరించాడు ఆ ప్రముఖ రచయిత.

"మరైతే నా కోరిక తీరే మార్గం లేదా?" దిగులుగా చూస్తూ అడిగాడు రాంబాబు".

"ఉంది సినిమాల్లో కథలూ, డైలాగులూ రాయాలంటే నువ్వు ముందు స్టేజి నాటకాలు రాయాలి. వాటిగురించి ప్రజలంతా పదే పదే గొప్పగా చెప్పుకోవాలి. మేమంతా అలా నాటకాలు రాసి సినిమాల్లో చెయ్యిపెట్టినవాళ్ళమే" చెప్పాడు.

"నా మైండ్‌లో బోలెడు కథలున్నాయి. రేపే నాటకం రాసి తెస్తాను. మీరు చదివి అభిప్రాయం చెప్పాలి" ఉత్సాహంగా అన్నాడు రాంబాబు.

"అలాగే ఓ చేత్తో నాటకాలు రాస్తూనే మరో చేత్తో కథలు కూడా రాస్తూండు. ఇవాళ తెలుగులో పత్రికలకు లోటులేదు. కనక విజృంభించు. చందమామ మొదలు వేదాంతభేరి వరకూ ప్రతి పత్రిక్కీ ఏదో ఒక కథ పంపించు. ఎలా అయినాసరే పాఠకులు నిన్నో రచయితగా గుర్తించాలి. వూరూరా నీ నాటకాలు ప్రదర్శించబడాలి. వాటి తాలూకు వార్తలూ, విశేషాలూ పేపర్లలో పడాలి. అలా అలా ఒకటి రెండేళ్ళలో నీ పేరు, నీ రచనల గిరాకీ సినిమా రంగానికి పాకుతాయి. అప్పుడు నీకు 'రైటర్'గా ఆ రంగంలో అవకాశాలు వస్తాయి" గీతాబోధ చేసిన లెవెల్లో చెప్పాడా రచయిత.

ఆ తర్వాత ఇరవై రోజుల వ్యవధిలో రెండు నవలలు రాశాడు రాంబాబు. వాటిని ఆ ప్రముఖ రచయితకు చూపించి, మార్పులూ, చేర్పులూ చేయించుకున్నాడు. మళ్ళీ ఫెయిర్ చేసి రెండు నవలల్నీ రెండు వారపత్రికలకు స్వయంగా పట్టుకెళ్ళి అందచేశాడు.

ఓ పత్రికా సంపాదకుడు, నవల తీసుకోకుండానే తన పాలసీ చెప్పాడు - "సారీ! మా పత్రికలో కేవలం రచయిత్రులకే ప్రాధాన్యం ఇస్తూంటాం మహిళలు రాసిన ఉత్తరాల్నే ప్రచురిస్తాం. వారి ప్రశ్నలకే జవాబులిస్తాం. వారు పంపే జోకుల్నే పబ్లిష్ చేస్తాం. అలాగే నవలల విషయంలో కూడా."

"అమే మీది మహిళాపత్రికా?" డౌటొచ్చి అడిగాడు.

"అలా అని కాదు. కానీ అది అంతే. అప్పుడప్పుడు రచయితలు రాసినవీ వేస్తూంటాం. కానీ మా రెగ్యులర్ రచయితలు మాకున్నారు. కనక మీ నవలను వేరే పత్రికకు ట్రై చేయండి" మర్యాదగా చెప్పాడు ఎడిటర్.

గత్యంతరంలేక ఆ నవలను తీసుకుని ఇంటికొచ్చేశాడు రాంబాబు. మర్నాడు ఆ ప్రముఖ రచయితను కలుసుకుని జరిగిన విషయం చెప్పాడు.

ప్రముఖ రచయిత పదినిమిషాలు ఆలోచించాడు. "నీకు అభ్యంతరం లేకపోతే ఓ పని చేద్దాం" అన్నాడు తర్వాత. ఏమిటన్నట్టు చూశాడు రాంబాబు. "ఆ పత్రికలో నేను రెగ్యులర్ రైటర్నే కాబట్టి ఈ నవలను నా పేరుమీదే ఇస్తే వాళ్ళు పబ్లిష్ చేస్తారు" చెప్పాడు రచయిత.

"అంటే...?"

"అంటే నవలా రచయితగా నీ పేరు బదులు - నా పేరుంటుంది. వాళ్ళిచ్చే పారితోషికంలో మనిద్దరం చెరిసగం తీసుకుంటాం"

ఇప్పుడు రాంబాబు ఆలోచనలో పడ్డాడు. నవలను ఎంతో కష్టపడి రాశాడు. పైగా తనకెంతో నచ్చిన సబ్జెక్టు. ఎవరి పేరు మీదనో అచ్చు అవుతుంది. పోనీ రెమ్యునరేషనైనా పూర్తిగా వస్తుందా అంటే అదీలేదు. ఎలా?

"పేరు నాది ఎలాగూ వుండదు కనుక - పారితోషికమైనా పూర్తిగా ఇవ్వండి" అన్నాడు ఆఖరి బేరంగా. రాంబాబుని ఓ పురుగును చూసినట్టుగా చూశాడు ఆ రచయిత.

"మార్కెట్‌లో నా పేరేమిటో - దానికున్న విలువేంటో నీకు తెలుసా? నేను 'ఓం నమఃశివాయః' అని రాసి పత్రిక్కి పంపితే పత్రికలవాళ్ళు అద్భుతమైన బొమ్మ వేయించి కలర్ పేజీలో ప్రింటు చేస్తారు తెలుసా? నా పేరు వాడుకుంటున్నందుకు ఆ మాత్రం 'గుడ్‌విల్' ఇవ్వకపోతే ఎలా?" అన్నాడు. రాంబాబు సిగ్గుపడ్డట్టుగా చూశాడు. "సారీ" అన్నాడు.

"కష్టపడి రాశాను. ఇది త్వరగా అచ్చులో రావటం ముఖ్యం మీరు ఏం చేసినా నాకిష్టమే" అన్నాడు ఆ నవలను అతని చేతిలో పెట్టి. తర్వాత నెలరోజులకే బ్రహ్మాండమైన పబ్లిసిటీతో - ఆ నవల సదరు ప్రముఖ రచయిత పేరు మీద అంతకుముందు రాంబాబుకి 'నో' అన్న పత్రికలోనే సీరియల్‌గా ప్రారంభమైంది. ప్రారంభ సంచికకు 'కవర్ పేజి'గా ఆ ప్రముఖ రచయిత ఫోటో కూడా వేశారు.

నవలకు మంచి పేరొచ్చింది. రచయితకు ఇంకా గొప్ప కీర్తి వచ్చింది. వారపత్రికలో నవలా ప్రచురణ పూర్తికాకముందే పబ్లిషర్లు ఆ రచయిత ఇంటిముందు 'క్యూ'లో నిలబడ్డారు.

'నవల పబ్లికేషన్' హక్కుల కోసం వేలంపాట ప్రారంభమైంది. మొత్తానికి నలభైవేలకు నవల అమ్ముడుపోయింది.

వారపత్రికవారు కేవలం పదివేలే ఇచ్చారు కనుక ముందు పెట్టుకున్న 'కండిషన్' ప్రకారం రాంబాబు చేతిలో అయిదువేలు పెట్టాడు రచయిత. "మరి నవలగా వేసినందుకు పబ్లిషర్స్ వేరే ఇచ్చారుగా?" అడిగాడు రాంబాబు.

"అది మన కండిషన్ కాదుగా?" తేలిగ్గా నవ్వుతూ అన్నాడు రచయిత. రాంబాబుకి ఒళ్ళు మండిపోయింది. 'కోర్టుకెడతాను' అన్నాడు.

"సాక్ష్యాలు లేవు. అనవసరంగా డబ్బు ఖర్చుపెట్టుకోకు. నువ్వు బాగా రాస్తావు. కనుక వేరే నవల్స్ రాయి. ఈసారి 'కండిషన్స్' స్పష్టంగా కాయితాలమీద రాసుకుందాం?" సిగరెట్టు వెలిగించుకుని తాపీగా చెప్పాడు రచయిత. మనసులోనే ఏడుస్తూ ఇంటికి వెళ్ళిపోయాడు రాంబాబు. ఆ రాత్రి తెల్లవార్లూ నిద్రపట్టలేదతనికి.

ఎన్నెన్నో ఆలోచనలు. అతని నవల తన పేరుమీద రాకపోయినా, ఆ నవలకు మంచి పేరొచ్చింది. వారం వారం వందలాది పాఠకులు నవలను మెచ్చుకుంటూ పత్రికకు ఉత్తరాలు రాశారు. ఆ రచయితకూడా తనను మెచ్చుకున్నాడు. అందుచేత తను బాగా రాయగలడు.

ఆ ధైర్యంతోనే మరికొన్ని నవలలు రాయాలని నిర్ణయించుకున్నాడు. ఈసారి, సినిమాని దృష్టిలో పెట్టుకుని సంభాషణలతో సహా దృశ్యాలుగా రాయాలని కూడా తీర్మానించుకున్నాడు.

నెలరోజుల్లో అలా రెండు స్క్రిప్టులు తయారుచేశాడు. అప్పుడప్పుడే దర్శకుడిగా మంచిపేరు తెచ్చుకుంటున్న మూర్తిగార్ని కలుసుకుని తనను తాను పరిచయం చేసుకున్నాడు. తనకు 'ఫలానా ప్రముఖ రచయిత' చేసిన అన్యాయం గురించి వివరంగా చెప్పుకున్నాడు.

"ఈ స్క్రిప్టులు నేను చదివి మీకు ఏ సంగతీ చెపుతాను. ఓ ఇరవైరోజుల తర్వాత కనిపించండి" అన్నాడు దర్శకుడు. ఆలోచనలో పడ్డాడు రాంబాబు.

"మళ్ళీ ఇక్కడ కూడా మోసపోను కదా?" అనుకున్నాడు.

"మీకేం భయంలేదు. ఇవి బావుంటే ఉపయోగిస్తాను లేదంటే జాగ్రత్తగా మీకు తిరిగిస్తాను. కావాలంటే రశీదు రాసిస్తాను" రాంబాబు మనసులో చెలరేగుతున్న భయాందోళనల్ని పసిగట్టిన దర్శకుడు అన్నాడు.

"అబ్బే అవసరంలేదు సార్. వుంచండి. మళ్ళీ కలుస్తాను" అంటూ అప్పటికి శలవు తీసుకున్నాడు రాంబాబు.

మళ్ళీ ఇరవైరోజుల తర్వాత కలుసుకున్నాడు ఆయన్ని, "వెల్‌కం. మీకు నేనే కబురు పెట్టాలనుకున్నాను" అంటూ ఉత్సాహంగా పలకరించాడు డైరెక్టర్ మూర్తి.

"స్క్రిప్ట్ చదివారా సార్? అడిగాడు కూర్చున్న తర్వాత.

"ఓ చదివాను. రెండూ బావున్నాయి. ఇవాళ సాయంత్రం మనం ఓ ప్రొడ్యూసర్ దగ్గరకు వెడుతున్నాం. అక్కడ మిమ్మల్ని కొత్తరైటరుగా పరిచయం చేస్తాను. మామూలుగా ఇప్పుడు రైటర్స్‌కి 'ఏభై' నించీ 'ఎనభై' వేలదాకా ఇస్తున్నారు. మీరు ఫస్ట్‌టైమ్ రాస్తున్నారు కనక - ముప్పయ్ ఇమ్మంటాను. నేను జాగ్రత్తగా చూసుకుంటానని కూడా చెప్తాను."

"మీ ఇష్టం సార్" సంతృప్తిగా, సంతోషంగా అన్నాడు రాంబాబు

"కానీ ఒక్క షరతు"

"ఏమిటిసార్"

"ప్రొడ్యూసర్ ఇచ్చే ముప్పయ్‌లో మీకు వచ్చేవి పదివేలే"

"అంటే?"

"తొలిసారిగా రిస్కుతీసుకుని నిన్ను సినీమారంగానికి పరిచయం చేస్తున్నాను. ఆ మాత్రం లాభం చూసుకోకపోతే ఎలా?" అన్నాడు మూర్తి రాంబాబుకి నోటమాటరాలేదు.

***(వచ్చేనెల మరో కథనం)***

Post your comments

*(పాతికేళ్ళ క్రిందట సితారలో ధారావాహికగా వచ్చిన ఈ కథనాలు*

*రచయిత ప్రత్యేక అనుమతితో పునర్ముద్రణ)*